క్లుప్తంగా

వైభవంగా మకరజ్యోతి దర్శనం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ కొండపై ఉన్న హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని అర్చకుడు బాబుస్వామి విశేష పూజలు చేశారు. సాయంత్రం మకరసంక్రమణ విశేషంగా కర్పూర జ్యోతిని వెలిగించారు. శరణుగోషలు చేశారు. అదేవిధంగా ఫిరంగిపురంలోని రామాలయం వద్ద హరిహరసుత అయ్యప్ప స్వామి భజనలు చేస్తూ పాటలు పాడారు. అనంతరం 12 కిలోల కర్పూరాన్ని వెలిగించారు. స్వామివారికి అర్చకుడు రాజేంద్రశర్మ విశేష పూజలు చేశారు. నుదురుపాడు గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకుడు పూర్ణచంద్రశాస్త్రి విశేష అర్చనలు చేశారు. కర్పూరజ్యోతిని వెలిగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని బాపనయ్య నగర్‌లో దివ్యాంగులకు మంగళవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్మీ ట్రస్ట్ ప్రతినిధి బూసి గోవిందరాజు, పాస్టర్ జాన్ సాల్మన్‌లు మాట్లాడుతూ మనిషి మరణించిన తరువాత వారిని గుర్తుపెట్టుకోవడం మానవుని విధేయతను తెలియజేస్తుందని పాస్టర్ చిట్టిబాబును గుర్తు పెట్టుకుని సేవా కార్యాక్రమాలు చేయడం అభినందనీయని అన్నారు. స్వర్గీయ పాస్టర్ బూసి చిట్టిబాబు 8వ వార్షికోత్సవ ప్రార్థనా కూడిన సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కారుమంచి రామారావు, పాస్టర్లు రవికాంత్, స్టీఫెన్, భాస్కరరావు, బేతాళరాజు, జోసెఫ్, సంసోన్, మోసే, పాస్టరమ్మ బేతపూడి సుశీల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పార్వేట ఉత్సవం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): సంక్రాంతిని పురస్కరించుకుని పాత మంగళగిరి పట్టణ పరిధిలోని సీతారాముల కోవెలలో బుధవారం రాముల వారి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంపై శ్రీ గోదా రంగనాధుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవం దేవస్థానం వద్ద ప్రారంభమై శ్రీ పానకాల స్వామివారి కొండ చుట్టూ సాగి నాలుగు కాళ్ల మండపం మీదుగా తిరిగి దేవస్థానానికి చేరుకుంది. ఈ ఉత్సవానికి కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన సూర్యదేవర సుధీర్, సుధశ్రీ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీతారామకోవెల మాజీ చైర్మన్ వాకా మంగారావు, శివాలయం మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ బోగి కోటేశ్వరరావు, పాల్గొనగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పేకాట స్థావరాలపై మెరుపు దాడులు



మేడికొండూరు: మండల పరిధిలోని పేకాట రహస్య స్థావరాలపై మేడికొండూరు పోలీసులు బుధవారం మెరుపు దాడులు చేశారు. డోకిపర్రు గ్రామం వెలుపల రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సీఐ నాగూర్‌మీరా సాహెబ్ తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద రూ. 5,200 నగదును, పేకముక్కలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగూర్ మీరా సాహెబ్ తెలిపారు. దాడుల్లో సీఐ వెంట ఎస్సై ఖాజీబాబు, స్పెషల్ బ్రాంచ్ నుంచి రమేష్, కానిస్టేబుళ్లు సైదా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి వేడుకలు

- మూడు రోజుల పండుగ.. సంప్రదాయాలు నిండుగా..
- సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన బంధువులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కనుమనాడు పశువులకు పూజలు



మంగళగిరిలో మహిళల కోలాట ప్రదర్శన



మంగళగిరిలో రంగవల్లులు అద్దుతున్న యువతి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): సంక్షేమ పథకాలు రాక, చేతిలో నగదు చెలామణి సరిగా లేకపోయినా నియోజకవర్గ ప్రజలు ఉన్నంతలో సంక్రాంతి పండుగను ఘనంగానే జరుపుకొన్నారు. రంగువల్లుల పోటీలు కనువిందు చేశాయి. పశువులకు పూజతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆత్మీయ సమ్మేళనాలు మురిపించాయి. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో చిన్నారులు, యువతీ యువకులు, మహిళలు సందడి చేశారు. చిన్నారులు ఆటపాటలలో మునిగి తేలారు. గాలిపటాలు ఎగురవేయడంతో పాటు కుర్చీలాట, కోలాటాలతో కుటుంబ సభ్యులు ఆనందోత్సవాల్లో పండుగ జరుపుకొన్నారు. రంగురంగుల ముగ్గులతో మహిళలు వాకిళ్లను అలంకరించారు. గ్రామాల్లో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

మద్యం కొనుగోళ్లలో తగ్గేదేలే..!

మంగళగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు మండలాలు వస్తాయి. ఈ నాలుగు మండలాల్లో 28 వైన్ షాపులు, 15 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా గడిచిన మూడు రోజుల్లో సుమారు రూ. కోటిన్నర నుంచి రెండు కోట్ల వరకు మద్యం విక్రయాలు జరిగాయి. వివిధ పందేలకు, మద్యానికి అధికమొత్తంలో వెచ్చించారు.

సెయింట్ ఆన్స్‌లో...

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి పండుగ సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కట్టెల పొయ్యిలపై పొంగళ్లు వండారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై చిన్నారులకు భోగి పండ్లు వారి తల్లులతో పోయించారు. భోగిమంటను వేశారు. భోగి విశిష్టత, సంక్రాంతి, కనుమ పండుగల గురించి పాఠశాల హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి వివరించారు. విద్యార్థులకు కుందుల్లాట, కబడ్డీ, ఖోఖో, పరుగు పందేలు, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

మంగళగిరి (తాడేపల్లిరూరల్): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో రంగోలి ఉత్సవ్ పేరుతో పట్టణ పరిధిలోని కుప్పరావు కాలనీ 11వ లైన్‌లో రంగోలి ఉత్సవ్ పేరుతో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ముగ్గుల పోటలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించామని, ముగ్గుల పోటీలలో మొదటి బహుమతిని అంజలి, ద్వితీయ బహుమతిని దేవిక, తృతీయ బహుమతిని పుష్పలతలు గెలుపొందారని తెలిపారు. గుంటూరు జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యావాహ గోలి రామారావు, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వేదశ్రీ, విశ్వహిందూ పరిషత్ రంగనాయకి, శాంతిస్వరూప్, పూర్ణిమ లక్ష్మి, మంగళగిరి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, నాయకులు భానుకిషోర్, మారెళ్ల సాంబశివరావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు అమ్మయ్య చౌదరి పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు..

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళగిరి పట్టణ పరిధిలోని 1వ వార్డులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు క్రీడలు నిర్వహించారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ), అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా), ప్రజానాట్యమండలి, సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, స్లో సైక్లింగ్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర ఆటలలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యులు సత్యనారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, 1వ వార్డు కార్యదర్శి కుప్పల శ్రీనివాసరావు, నిర్మల కళాశాల ప్రిన్సిపాల్ వీవీ ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఆటల పోటీలు..

తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, మహిళా సంఘం, యువజన సంఘం, ప్రజా నాట్య మండలి వారి సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం తాడేపల్లిలోని సుందరయ్యనగర్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు మాట్లాడుతూ మనుషుల మధ్య ఐక్యతను చాటే విధంగా ముగ్గుల పోటీలు, కుర్చీలాట, పరుగుపందెం, ఆట-పాట, కోలాటం, నాటికలు తదితర ఆటల పోటీలు నిర్వహించామని, మహిళలు, చిన్నారులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. క్లబ్ మాజీ కార్యదర్శి చంద్ర ఓబులా రెడ్డి, నిర్వాహకులు ఎస్.వెంకటరావు, ఎం.బి.వి.కె.కార్యదర్శి పిన్నమనేని మురళి, ప్రముఖ రచయిత్రి మక్కపాటి తులసి, రంగామణి, వై.సుబ్బారావు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకుడు కె.దేవేంద్ర, కొట్టి కరుణాకర్‌రావు, నార్ని నాగేశ్వరరావు, భుజంగరావు, మహిళా నాయకులు ఎస్.గిరిజ తదితరులు పాల్గొన్నారు.



పండుగ సందర్భంగా చెరుకులు కొనుగోలు చేస్తున్న యువకులు



సెయింట్ ఆన్స్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంగళగిరి శాఖ ఏబీవీపీ నాయకులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చికిత్స పొందుతూ మృతి

తాడికొండ: పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం వెంకటపాలెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటపాలెం గ్రామానికి చెందిన ముప్పా సురేష్(40) మద్యానికి బానిసై ఇంటిలోని వారు మానుకోమని చెబుతున్నా మానలేక మానసిక సంఘర్షణతో ఈ నెల 13వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా బుధవారం మరణించినట్లు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

పులి రామారావుకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పులి రామారావు గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బుధవారం వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఇతర నాయకులతో కలసి పులి రామారావు ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు నాళి వెంకట కృష్ణ, ఈపూరు ఆదాము, పచ్చల శ్యాము, వేమూరి వందనం, నాగబాబు, కొండమూరి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈమనిలో....

దుగ్గిరాల మండలం ఈమనిలో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాతృమూర్తి ముత్తు అనుమాయమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో దొంతిరెడ్డి వేమారెడ్డి వైఎస్సార్ సీపీ నాయకులతో వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివగోపయ్య, ధనుంజయ్, కోటేశ్వరరావు, ఉప్పల సుబ్బారావు, దానబోయిన సుబ్బారావు, దానబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయవాడలో ధర్నాలో రైతులు పాల్గొనాలి

తెనాలి: పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ జనవరి 17న విజయవాడలో జరగనున్న ధర్నాలో రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. పట్టణ చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలితో కలిసి సాంబిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాపితంగా రైతాంగం తాము పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలనే డిమాండును కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవట దుర్మార్గమన్నారు. కేంద్రంప్రభుత్వం రద్దుచేసిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను దొడ్డిదారిన అమలుచేస్తోందని ఆయన మండిపడ్డారు. గత 47 రోజులుగా జరుగుతున్న దల్లేవాల్‌సింగ్ నిరాహారదీక్షను పట్టించుకోకపోవటం, రైతుసంఘాలతో చర్చించక పోవడం కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దంపడుతుందన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జోరుగా సాగుతున్నాయి. మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నాల్గవరోజు బుధవారం పశ్చిమ గోదావరి - కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో పశ్చిమ గోదావరిజట్టు గెలిచింది. అనంతరం గుంటూరు - శ్రీకాకుళం మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు విజయం సాధించింది. పశ్చిమ గోదావరి జట్టులో జాస్మిన్‌కు, గుంటూరు జట్టులో మహేష్‌కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును, ఒక్కొక్కరికి రూ.10వేలు నగదును బహుమతిగా అందజేశారు.

కార్మికుల ఆకలి బాధలు పట్టవా?

సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు



శిబిరం వద్ద మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తూ ఆకలితో అలమటిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా మొద్దు నిద్ర నటిస్తోందని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఏసీసీ కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్‌తో కలసి ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ న్యాయబద్ధంగా కార్మికులకు రావాల్సిన నష్ట పరిహారాన్ని కంపెనీ యాజమాన్యం చెల్లించేంత వరకు, ప్రభుత్వం జోక్యంచేసుకుని నష్టపరిహారాన్ని ఇప్పించేంత వరకు కార్మికులు పోరాడుతూనే ఉంటారని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేకమంది కార్మికులు అనారోగ్యాలతో, ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందారని అన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలలో ఎస్‌కె సుభాని, బి. సూర్యప్రకాష్, ఇమాంబి, నవనీతం, విజయలక్ష్మి కూర్చొనగా, మద్దతుగా ఎం ఆశీర్వాదం, పిచ్చయ్య, మూర్తి, హగ్గయ్య, ఆరిఫ్, శారమ్మ, నాగమల్లేశ్వరి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా గోడ కూల్చడం అన్యాయం

- మాలసంఘాల జేఏసీ చైర్మన్ వి.దేవిప్రసాద్
- పొనుగుపాడులో ఆర్సీఎం చర్చి స్థల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న మాలసంఘాల జేఏసీ చైర్మన్ వి.దేవిప్రసాద్, రాజు, నాయకులు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలోని ఆర్సీఎం చర్చి స్థలంలో ఉన్న గోడను ఎవరి అనుమతులు లేకుండా ఏకపక్షంగా అధికారులు కూల్చడం అన్యాయమని మాల సంఘాల జేఏసీ చైర్మన్ వి.దేవిప్రసాద్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో ఇటీవల ఆర్సీఎం చర్చి స్థలంలో నిర్మించిన గోడను కూటమి ప్రభుత్వ నాయకుల అండతో అధికారులు కూల్చివేసారు. దీనిపై మాల సంఘాల జేఏసీ చైర్మన్ వి.దేవిప్రసాద్, నాయకులు బుధవారం బాధితులను పరామర్శించారు. అధికారుల పరిశీలన లేకుండానే, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే చర్చి ఆస్తులను కూల్చివేయడం అన్యాయమన్నారు. దీనికి బాధ్యులైన వారిపై కేసు వేస్తామన్నారు. మాల సంఘాల తరపున బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. పడగొట్టిన గోడను తిరిగి నిర్మించాలని, దీనికి అవసరమైన ఖర్చులు వారే భరించాలని చెప్పారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. చర్చికి సంబంధించిన స్థలానికి సరైన పత్రాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం చర్చి స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా ఉన్న బాధితులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు. జైభీమ్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి రాజు మాట్లాడుతూ చర్చిగోడను పడగొట్టి రోడ్డువేసిన అధికారులను ప్రశ్నిస్తే ఎవరూ ఎటువంటి సమాధానం ఇవ్వడం లేదని చెప్పారు. పంచాయతీ సర్పంచ్‌ని దీనిగురించి అడిగితే పంచాయతీలో తీర్మానం చేయలేదని చెప్పారు. అన్యాయంగా గోడను కూల్చి అక్రమంగా రోడ్డు నిర్మించారని తెలిపారు. మాల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ జి.రామారావు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జి.జాన్‌పాల్, ఎన్.నీలాంబరం, కె.చంద్రశేఖర్, సీహెచ్.డేవిడ్ విలియమ్స్, టి.వీరయ్య, జె.సాల్మన్, సర్పంచ్ మధుసూధనరావు, ఆర్.కోటిస్వామిలు పాల్గొన్నారు.

కారు పార్కింగ్‌లో నిర్లక్ష్యం

వైన్‌షాపు వద్దనుంచి వేగంగా వెళ్లి ఓ ఇంటిని ఢీకొన్న కారు



ఇంటి గోడను ఢీకొట్టి ఆగిన కారు

తాడేపల్లిరూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు పార్క్ చేసి హ్యాండ్ బ్రేక్ వేయకుండా అశ్రద్ధగా వెళ్లిపోవడంతో ఆ కారు దొర్లుకుంటూ వెళ్లి ఓ ఇంటి గోడను ఢీకొని ఆగిపోయిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి వెళ్లేర హదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైన్స్ షాపు వద్ద మద్యంమత్తులో వున్న ఓ వ్యక్తి కారు పార్కింగ్ చేసి హ్యాండ్ బ్రేక్ వేయడం మరిచాడు. ఆ వ్యక్తి మద్యం కొనుగోలు చేయడానికి వైన్‌షాపుకు వెళ్లేలోపు ఆ కారు సుమారు 10 మీటర్లు తాడేపల్లి రోడ్డులో ఎడమ చేతి వైపు నుండి కుడిచేతివైపునకు వెళ్లి ఇంటి గోడను ఢీకొట్టింది. ఆ గోడను కారు ఢీకొట్టడంతో పెద్ద శబ్దం రావడంతో భయభ్రాంతులకు గురై ఏం జరిగిందో అంటూ రోడ్డుమీదకు వచ్చారు. దీంతో కారు పార్క్ చేసిన వ్యక్తి అక్కడి నుంచి చల్లగా జారుగుకున్నాడు. ఆ రహదారిలో నిత్యం వేర్వేరు వ్యాపార సంస్థల ముందు మందుబాబులు పార్క్ చేసి అక్కడే మద్యం సేవిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, షాపు యజమానులతో సైతం మందుబాబులు గొడవకు దిగి దాడిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎంతోమంది మహిళలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నారని, కనీసం మద్యం షాపు వద్ద రోడ్డు పక్కన వాహనాలు ఆపకుండా రోడ్డుమీద ఆపడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• దవళ వర్ణ శోభితం

ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను తట్టుకొని మెరిసిన తెల్ల బంగారం చివరితీతకు కూలీల్లేక పంట పొలాల్లో తెల్లని తివాచీలా పరుచుకుంది. ప్రస్తుతం పంట పొలాల్లో కూలి పనులు అధికంగా ఉండటంతో పత్తితీతలు తీసేందుకు కూలీలు దొరకడం లేదు. దీనికి తోడు మూడురోజుల పాటు సంక్రాంతి సెలవులు రావడంతో పంట పొలాల్లో తెల్లగా పగిలిన పత్తి పంట పరుచుకున్న దవళ వర్ణంలో దర్శనమిస్తోంది. తాడికొండ మండలంలో పత్తి పొలాల్లో కనిపించిన ఈ అందమైన దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది.

– తాడికొండ



తాడికొండ మండలంలో చివరితీతకు కూలీలు లేక దవళ వర్ణంలో మెరుస్తున్న పత్తి

ప్రమాదాల మలుపు!

- తాడికొండ - కంతేరు గ్రామాల మధ్య కొండవీటి వాగుపై ప్రమాదకరంగా మలుపు
- స్పీడ్ బ్రేకర్లు, సూచీలు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల వినతి



కంతేరు రోడ్డు పెద్ద వంతెన 'ఎస్' మలుపు వద్ద మంగళవారం ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం

తాడికొండ: తాడికొండ - కంతేరు గ్రామాల మధ్య కొండవీటి వాగుపై పెద్ద వంతెన వద్ద ఉన్న ఎస్ మలుపు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద ప్రమాద హెచ్చరికను సూచించే బోర్డులు కానీ, స్పీడ్ బ్రేకర్లు కానీ ఏర్పాటు చేయకపోవడంతో నిత్య ప్రమాదాలకు నిలయంగా మారింది. శీతాకాలం నేపథ్యంలో వేకువజామునే కురిసే మంచుదుప్పటి తెరలలో మలుపు వద్ద ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. గతంలో కంతేరు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈ మలుపులో వాహనం ఢీకొని మృతిచెందాడు. మంగళవారం ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం మలుపులో ఢీకొట్టడంతో వాహనదారుడు తీవ్రగాయాల పాలయ్యాడు. హెల్మెట్ ధరించి ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు స్పందించి మలుపులో సూచీలు, స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బోసిపోయిన రహదారులు



నిర్మానుష్యంగా వున్న ఎన్ఆర్ఐ హాస్పిటల్ రోడ్డు

తాడేపల్లిరూరల్: సంక్రాంతి నేపథ్యంలో మంగళగిరి పపట్టణం నిర్మానుష్యమైంది. సినిమాహాళ్ల వద్ద తప్ప.. మిగిలిన ప్రాంతాలన్నీ జనాలు లేక రోడ్లు బోసిపోయాయి. సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు అందరూ తరలివెళ్లడంతో రోడ్లపై రద్దీ తగ్గింది. నిత్యం రద్దీగా ఉండే గౌతమ బుద్ధరోడ్, ఏపీఐఐసీ, సాఫ్ట్‌వేర్ కంపెనీ రోడ్డు, మెయిన్‌బజార్, పాతబస్టాండ్ సెంటర్, డిపో రోడ్డు సెంటర్ తదితర ప్రాంతాలు జనాలు లేక వెలవెలబోయాయి. కనుమ రోజున సినిమాహాళ్లు, మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. మిగిలిన ప్రాంతాల్లో బోసిపోయాయి. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఇళ్లల్లో కాలం వెళ్లదీయడంతో రోడ్లు నిర్మానుష్యమయ్యాయి.